

బాగా చదవాలని చెప్పినందుకు..

బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని చెప్పడంతో మనస్తాపానికి గురైన బాలుడు కొల్లేరు సర్కారు కాల్వ వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. 8లో ▸



కూటమి పాలనలో క్రీడల్

కూటమి ప్రభుత్వంలో క్రీడలకు ప్రోత్సాహం కరువైంది. వైఎస్సార్ క్రీడా పురస్కారాలు రద్దు చేయడంపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



కొత్త పింఛన్లు లేనట్టే..

అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 8లో ▸

ఇదేందిరొయ్యో

వైట్‌గట్‌తో వలవిల
- ఖాళీ అయిపోతున్న చెరువులు
- ఆందోళనలో రైతులు
- ఉమ్మడి జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో సాగు
- వైట్‌గట్‌తో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో పట్టుబడులు



చెరువుల్లో రొయ్యలను పట్టుబడి చేస్తున్న దృశ్యం

ఆకివీడు: డాలర్ల పంటగా ప్రసిద్ధి చెంది రైతులకు సిరులు కురిపించిన రొయ్యల సాగు రోజురోజుకూ దివాళా దిశగా సాగుతోంది. రొయ్యల చెరువుల్లో వైట్‌గట్ వైరస్ సునామీ సృష్టిస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వైరస్ సోకి రొయ్యలు చనిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వైరస్ నివారణకు ఎన్నిరకాల మందులు వాడినా ఫలితం దక్కడం లేదు. దీంతో రొయ్యల సాగు కత్తిమీద సాములా మారింది.

దిక్కుతోచక.. సహకారం అందక..

డాలర్ల పంట పండిస్తున్న రైతులకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహకారం అందడం లేదు. కనీసం మత్స్యశాఖ అధికారుల నుంచి కూడా ఎలాంటి సూచనలు, సలహాలు అందడం లేదు. దీంతో రొయ్యలు వైట్‌గట్ ప్రభావంతో కొట్టుకుపోతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు ఆర్థిక మాంద్యంతో విలవిలలాడుతున్నారు. కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని పొందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రొయ్యల సాగు చేసే రైతులకు పైసా సాయం కూడా అందడం లేదు. పైగా విద్యుత్ బిల్లులు ఇతర పన్నులతో ప్రభుత్వాలు లబ్ధి పొందుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. వైట్‌గట్ ప్రభావంతో ప్రస్తుతం సుమారు 1.10 లక్షల ఎకరాలకు పైగా చెరువులు ఖాళీ అయ్యాయి. 200, 150, 120, 100 కౌంట్‌లోనే రొయ్యల్ని పట్టి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా రాక ఎకరాకు సుమారు రూ.లక్షకు పైగా నష్టం వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వైట్‌గట్ వ్యాప్తి ఇలా..

రొయ్యలలో జీర్ణవ్యవస్థకు వైరస్ సోకడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తిస్తుంది. రొయ్యకు విరేచనం అయ్యి తెల్లటి దారం వంటి పదార్థం వస్తుంది. రొయ్య చెరువులో సాగులో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, రొయ్య సీడ్‌లో లోపాలు, నాణ్యమైన మేత అందక పోవడం, చెరువుల అడుగు భాగంలో కాలుష్యం చేరుకోవడం, చెరువును ఆరబెట్టకపోవడం వంటి పలు కారణాలతో వైట్‌గట్ వైరస్ వ్యాప్తిస్తుంది. వ్యాధికి గురైన తర్వాత రొయ్యలు మేత తినడం తగ్గిస్తూ క్రమేపీ తినడం మానేస్తాయి. రొయ్య పరిమాణం, నాణ్యత తగ్గిపోతుంది. గుల్ల కొట్టకపోవడం, బరువు తగ్గడం, ఈత కొట్టడం వంటి పరిణామాలు సంభవిస్తాయి. వైట్‌గట్ వైరస్ నివారణకు పలురకాల మందులు వాడుతున్నా ప్రయోజనం ఉండటంలేదు. కొన్నేళ్లుగా రొయ్యల్ని వైట్‌గట్ వైరస్ విజృంభించి రొయ్యలు చనిపోవడానికి కారణమవుతున్నా దీనిపై శాస్త్రీయ అధ్యయనం జరగడం లేదు. మందులు తయారీకి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. అందుబాటులో ఉన్న యాంటీ బయోటిక్ మందుల్ని రైతులు వాడినా ఫలితం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా నాటు పద్ధతులను అనుసరిస్తున్నారు. అల్లం, వెల్లుల్లి, మెంతిపిండి, కాకరకాయ, ఈస్ట్ బెల్లం వంటివి కలిపి వాడుతున్నారు.

అవగాహన లేక.. నష్టాలు తప్పక..



వైట్‌గట్ వైరస్ సోకిన రొయ్యలు

వైట్‌గట్‌పై రైతులే స్వీయ అనుభవంతో మందులు, నాటు పద్ధతులు పాటిస్తున్నారు. గట్ రాకుండా ముందు జాగ్రత్త చర్యలపై మత్స్యశాఖ అధికారులు అవగాహన కల్పించడం లేదని రైతులు అంటున్నారు. అలాగే సీడ్, మందులు, మేత నాణ్యతపై ప్రభుత్వ తనిఖీలూ కొరవడ్డాయి. రైతులు సాగు చేసే చెరువులపై మత్స్యశాఖ అధికారులు ముందుగా ఎలాంటి సూచనలు ఇవ్వడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఓ పక్క రొయ్యల ధరలు పతనమవుతుంటే మరోపక్క రొయ్యల సాగు చతికిలపడుతోంది. రొయ్యల సాగుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపెడా, అప్సడా వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి శాస్త్రీయమైన సూచనలు సలహాలు ఇచ్చి, ఆయా వైరస్‌ల నియంత్రణకు ప్రత్యేక ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే వ్యాధుల నివారణకు శాస్త్రీయ అధ్యయనాలు పెరగాలని అంటున్నారు.

దారికి అడ్డంగా కంచె..
టీడీపీ నేత నిర్వాకం

ఆందోళనలో మూడు కుటుంబాలు



బాధితుల ఇంటి ముందు వేసిన ఫెన్సింగ్

చాట్రాయి: టీడీపీ నాయకుడి నిర్వాకం మూడు కుటుంబాలకు దారి లేకుండా చేసింది. మూడు తరాల నుంచి నడుస్తున్న దారికి అడ్డంగా కంచె నిర్మించడంతో మూడు కుటుంబాల వారు ఇంటి నుంచి బయటికి రావడానికి కూడా వీలులేని పరిస్థితి. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం కోటపాడులో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కోటపాడుకి చెందిన చీపు ధర్మారావు, చీపు నాగరాజు, చీపు వెంకటేశ్వరరావుల ముత్తాతలకు చెందిన 251–2 సర్వే నంబర్‌లో 18 సెంట్ల భూమి ఉంది. మూడు కుటుంబాల వారు ఈ భూమిలో నుంచి నడుస్తున్నారు. మూడేళ్ల క్రితం ఈ భూమి తమదంటూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వేముల నాగేశ్వరరావు అభ్యంతరం చెప్పడంతో గొడవ జరిగింది. నాలుగు రోజుల క్రితం నాగేశ్వరరావు ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. దీంతో బయటకు వెళ్లడానికి, లోపలికి రావడానికి దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం మంచి నీరు కూడా తెచ్చుకోలేని దుస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎవరూ సహకరించకపోవడంతో చనిపోవాలనిపిస్తోందని కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ సమస్యను తహసీల్దార్ ప్రశాంతికి, పోలీసులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

న్యూస్‌రీల్

త్వరలో భీమవరం మున్సిపల్ ఎన్నికలు



భీమవరం వచ్చిన మంత్రి నారాయణ

భీమవరం: త్వరలో భీమవరంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని, గ్రామాలను అనుసంధానం చేసి ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూస్తామని రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు నివాసానికి ఆదివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిగిలిన మున్సిపాలిటీలతో సంబంధం లేకుండా ఇక్కడ ఎన్నికలు జరిగేలా చూస్తామని, సకాలంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ నేతలు మెంటే పార్థసారథి ఉన్నారు. అనంతరం మంత్రి నారాయణ పాలకొల్లు వెళ్లారు.

పారిజాతగిరిలో పవిత్రోత్సవాలు



పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం విశ్వక్సేన పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం పుణ్యాహవచనం, విశేష హోమ కార్యక్రమాలు, నవ కుంభ ఆరాధనలు చేశారు. ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులకు నవ కలశ స్నపనం జరిపించారు. ఆలయంలోని ప్రధాన ధ్రువ మూర్తికి, దేవతామూర్తులకు పవిత్రాలను సమర్పించారు. వైఖానస ఆగమయుక్తంగా యజ్ఞ బ్రహ్మ పానంగిపల్లి సత్య పవనకుమార్ ఆచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈఓ మానికల రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం ఉదయం పవిత్ర అవరోహణ, పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఈఓ తెలిపారు.

జగన్‌ను డిక్లరేషన్ అడగడం విడ్డూరం



గోవిందరాజుల నాయుడు, జెడ్పీటీసీ

పాలకొల్లు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనకు వెళితే డిక్లరేషన్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని జెడ్పీటీసీ నడపన గోవిందరాజులనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. గతంలో వైఎస్సార్, జగన్ ముఖ్యమంత్రి హోదాలో వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించినప్పుడు లేని నిబంధనలు ఇప్పుడు విధించడం సరికాదన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారంటూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపారని గుర్తుచేశారు. ఇవేమీ పట్టించుకోకుండా ఇప్పుడు చంద్రబాబు నెయ్యిలో కల్తీ జరిగిందని రాద్ధాంతం చేయడం సరికాదని పేర్కొన్నారు.

వసతులు కల్పిస్తేనే ప్రజల్లో సంతృప్తి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో తాగునీరు, డ్రెయినేజీ, శానిటేషన్, వీధి దీపాలు వంటి వసతులు సక్రమంగా సమకూరిస్తే ప్రజల నుంచి ఫిర్యాదులు రావని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. టిడ్కో సముదాయాల వద్ద ఆస్పత్రి, అంగన్‌వాడీ సెంటర్, షాపింగ్ మాల్, రైతు బజారు, ఏటీఎం వంటివి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. లోటు బడ్జెట్ ఉండటంతో శానిటేషన్ సిబ్బందిని పెంచడం కంటే స్వీపింగ్ మెషీన్లు ఉపయోగించాలని సూచించారు. ఉండి, ఆచంట నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణికి సూచించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

విశాఖ ఉక్కుపై దీక్షలు



మాట్లాడుతున్న చెల్లబోయిన రంగారావు


భీమవరం: విశాఖ ఉక్కును దొడ్డిదారిన ప్రైవేటీకరణకు యత్నిస్తున్న ప్రభుత్వాల తీరుకు నిరసనగా మరోసారి ప్రజా సంఘాలు పోరాటానికి సన్నద్ధమవుతున్నాయి. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో కార్మిక రైతు వ్యవసాయ కార్మిక ప్రజాసంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కులోని పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను వేర్వేరు రాష్ట్రాల్లోని స్టీల్ ప్లాంట్‌లకు బదిలీ చేయడం, నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను పనిలోకి రావద్దని చెప్పడం చూస్తే ప్రైవేటీకరణ ప్రయత్నాలు మొదలయ్యాయని అర్థమవుతోందన్నారు. ఈ తీరును నిరసిస్తూ అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో రిలే నిరాహార దీక్షలకు నిర్ణయించామని, భీమవరంతో పాటు పలు పట్టణాల్లో ఆందోళనలు చేపడతామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా నాయకులు బి.వాసుదేవరావు ఎం.అంజనేయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం జరిగేనా?

- శ్రీవారి ఆలయ పారిశుద్ధ్య కాంట్రాక్టులో అవకతవకలు
- నేటితో ముగియనున్న కాంట్రాక్టు గడువు
- స్వాహా అయిన సొమ్ము సంగతేంటి!
- ఆందోళనలో కార్మికులు
- నూతన ఈఓపైనే ఆశలు



ఆలయంలో కాంట్రాక్టరు తీరుపై ధ్వజమెత్తుతున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)



ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానంలో పారిశుద్ధ్య కాంట్రాక్టు గడువు సోమవారంతో ముగియనుంది. దీంతో కార్మికుల్లో ఆందోళన మొదలయ్యింది. తమ పీఎఫ్ సొమ్ము స్వాహా చేయడంతోపాటు 50 మంది కార్మికులను అసలు నియమించకుండా బిల్లులను పూర్తిగా దిగమింగిన కాంట్రాక్టర్, అతనికి సహకరించిన అధికారుల సంగతేంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టరు నుంచి తమకు న్యాయంగా అందాల్సిన పీఎఫ్, ఇతర అలవెన్స్‌లను అందించాలని కోరుతున్నారు. అయితే కార్మికులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి దేవస్థానంలో పారిశుద్ధ్య పనులను మంగళగిరికి చెందిన సెవెన్ హిల్స్ ఫెసిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 2022 అక్టోబర్ 1 నుంచి 2024 సెప్టెంబర్ 30 వరకు అప్పగించారు. కాంట్రాక్టు కాలంలో పలు అక్రమాలు బయటపడ్డాయి. తక్కువ మంది కార్మికులతో పనులు చేయించడం, కార్మికుల పీఎఫ్ సొమ్ము, కార్మికులపై పనిభారం మోపడం, మూడు షిఫ్టులకు బదులు రెండు షిఫ్టుల్లో పనులు చేయించడం, ఓటీలు ఇవ్వకపోవడం, జీతాల్లో కోతలు వంటి పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. వీటన్నింటిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది.

ఇప్పటికీ పిలవని టెండర్లు

పారిశుద్ధ్య కాంట్రాక్టు నిర్వహణ పూర్తిగా ఇంజనీరింగ్ విభాగ అధికారుల కనుసన్నల్లో జరిగింది. కాంట్రాక్టులో అక్రమాలు జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా.. మరో ఏడాది పాటు అదే కాంట్రాక్టరుకు కొనసాగించేందుకు అధికారులు ప్రయత్నించారు. దీనిలో భాగంగా మూడు నెలల ముందు నుంచే చేపట్టాల్సిన కొత్త టెండర్ ప్రక్రియను ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో మంగళవారం నుంచి అదే కాంట్రాక్టరుతో పనులు జరిపిస్తారా.. లేక దేవస్థానం ఆధ్వర్యంలో జరిపిస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా ఇంజనీరింగ్ విభాగ అధికారులు కాంట్రాక్టులో జరిగిన అక్రమాలను పక్కన పెట్టి కాంట్రాక్టర్ ప్రతి నెలా కార్మికులకు ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ జీతం ఇస్తున్నారని చెప్పడం విడ్డూరం. వాస్తవానికి కార్మికులు చేసిన పనికి ఓటీలు ఇచ్చి ఉంటే ప్రతి నెలా ఒక్కో కార్మికుడికి రెట్టింపు జీతం అందేది. పీఎఫ్ సక్రమంగా కట్టి ఉంటే ఒక్కో కార్మికుని ఖాతాలో రూ.50 వేలు పైగా నిల్వ ఉండేది. అయితే అందులో సగం కూడా లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

పూర్తిస్థాయి విచారణ జరపాలి : శ్రీవారి దేవస్థానంలో నూతన ఈఓగా నాలుగు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తమకు న్యాయం చేస్తారని పారిశుద్ధ్య కార్మికులు ఆశిస్తున్నారు. జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తమకు రావాల్సిన సొమ్మును ఓచర్ పేమెంట్ ద్వారా అందించాలని, అలాగే పనిచేయని 50 మంది కార్మికుల సొమ్మును శ్రీవారి ఖాతాకు జమచేయాలని కార్మికులు, భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు దారుణం



యండగండిలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

ఉండి: కాళ్ల మండలం ఏలూరుపాడులో బీఆర్ అంబేడ్కర్ బ్యానర్ తొలగించిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తాను చేసిన పొరపాటును అంగీకరించాలని, అలాగే ఇటీవల ఆయన ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలు సరికాదని కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ అన్నారు. ఆదివారం పాందువ్వ, యండగండి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికే దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. అటువంటి మహనీయుని బ్యానర్‌ను దారుణంగా పీకేయడం బాధాకరమన్నారు. అంబేడ్కర్‌ను ఓ జాతి నాయకుడిగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సామరస్యత కోసం రిజర్వేషన్‌లు కల్పించి పేదల జీవితాల్లో అంబేడ్కర్ వెలుగులు నింపారన్నారు. రఘురామకృష్ణరాజు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు తాడి కుమార్, ఎం.రామయ్య, ఎం.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు అధికారి చంద్రశేఖర్

నరసాపురం రూరల్: జూనియర్ కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన గుణాత్మక విద్యను పెంపొందించే రీతిలో బోధన ఉండాలని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పేరుపాలెంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం (ఏపీజేఎంఏ) నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యా బోధనలో శ్రద్ధ, నాణ్యత అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రగతి రాజు మాట్లాడుతూ కరస్పాండెంట్లు ఐకమత్యంగా సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఘంటశాల బ్రహ్మాజీ మాట్లాడుతూ ఏపీజేఎంఏ రాష్ట్ర నాయకత్వం ద్వారా ఎఫిలియేషన్ ఆన్‌లైన్‌లో వచ్చేలా కృషి చేశామన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి వీవీ స్వామి, ట్రెజరర్ అవినాష్, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

భీమవరం: తిరుమల లడ్డూ అపవిత్రతపై సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదక్షుడు వబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు తెలిపారు. భీమవరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్లకు గవర్నర్ పేరుతో వినతిపత్రాలు ఇస్తామన్నారు. దేశవ్యాప్తంగా కూడా నిరసన కార్యక్రమాలు చేయనున్నట్టు ప్రకటించారు.

ఆర్వోబీలకు పచ్చజెండా

- ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల నిర్మాణాలు
- త్వరలో సర్వే, స్థల సేకరణ
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- **పశ్చిమగోదావరి జిల్లా :** తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం వద్ద
- **ఏలూరు జిల్లా :** ఏలూరు–వట్లూరు మధ్య, పూళ్ల–చేబ్రోలు మధ్య, దెందులూరు–భీమడోలు మధ్య



నవాబుపాలెంలో ఆర్ఓబీ నిర్మించనున్న ప్రాంతం

తాడేపల్లిగూడెం: జాతీయ మౌలిక వసతుల కల్పనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబీ)లు నిర్మించాలనే ప్రతిపాదనలు చేసింది. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంది. సేతు భారతం పథకంలో ఆయా రాష్ట్రాల సంయుక్త సహకారంతో ఆర్వోబీలు నిర్మిస్తోంది. ఈ క్రమంలో తాజాగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లోని 28 ఆర్వోబీల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనుంది. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు చోట్ల ఆర్వోబీలు నిర్మించనున్నారు. వీటికి సంబంధించి పరిపాలనా అనుమతులు వచ్చాయి.

సర్వే.. నిధుల విడుదల

ఆర్వోబీల నిమిత్తం ప్రభుత్వాలు సంయుక్తంగా భూసేకరణ, ఆక్రమణల తొలగింపు తదితరాలకు సంబంధించి సర్వే చేయాల్సి ఉంది. జాయింట్ సర్వే అనంతరం ఆయా బ్రిడ్జిలకు జనరల్ ఎరేంజ్‌మెంట్ డ్రాయింగ్ (జీఏడీ) తయారు చేయాలి. డిజైన్, ఇతర పనులు ఆలస్యం కాకుండా సింగిల్ విండో క్లియరెన్సుల కోసం నోడల్ ఆఫీసర్‌ను నియమించుకోవాలి. రైల్వేశాఖకు సంబంధించి ఉన్న స్థలంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి ఇంకా ఎంత స్థలం అవసరం అవుతుంది, ఆక్రమణలుంటే వాటిని తొలగించడం వంటి పనులు జాయింట్ సర్వేలో పూర్తి చేసి కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. ఈ వంతెనల నిర్మాణం కోసం సెంట్రల్ రోడ్ ఫండ్ కేటాయిస్తారు. ఈ నిధులను డీజిల్, పెట్రోల్‌పై సెస్ రూపంలో వసూలు చేసే అవకాశం ఉంది. ఆర్వోబీలు నిర్మించే సమయంలో ఎక్కడైనా జాతీయ రహదారి కారిడార్ పరిధి తగిలితే మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్సుపోర్టు కల్పించుకుని పనులకు విఘాతం లేకుండా ఎంఓయూ చేసుకోవాల్సి ఉంటుంది.

నవాబుపాలెంలో ఆర్వోబీతో మేలు

తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో ఆర్వోబీ నిర్మిస్తే ప్రజలకు, వాహనచోదకులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మండలంలోని ఆరుగొలను, కొత్తూరు గ్రామాల్లో కంకర క్వారీలు ఉండటంతో రోజూ వందలాది లారీలు నవాబుపాలెం రైల్వే లెవిల్ క్రాసింగ్ దాటి వెళుతున్నాయి. ఆ సమయంలో విశాఖ, విజయవాడ వైపు వెళ్లే రైళ్లు, గూడ్సులతో ఎక్కువ సమయం గేటు వేసి ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ ట్రాక్‌కు ఆనుకుని ఎఫ్‌సీఐ అద్దె గోదాములు ఉన్నాయి. లెవీ సేకరణ, ప్రొక్యూర్‌మెంటు సమయంలో వందల సంఖ్యల్లో బియ్యం లారీలు ఇక్కడి గోదాములకు వస్తాయి. దీంతో ఆ సమయంలో గంటల పాటు ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఆయా సమస్యల పరిష్కారానికి ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఎట్టకేలకు రైల్వేశాఖ నిర్ణయంతో శాశ్వత పరిష్కారం లభించనుంది.

క్లుప్తంగా

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


తేజేష్ మృతదేహం

తణుకు: తణుకు పాతవూరు ఎన్టీర్ పార్కు వెనుక నివాసం ఉంటున్న యువకుడు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తణుకు పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో తాతయ్య అప్పలనాయుడు వద్ద ఉంటూ చదువుకుంటున్న శేషాపు తేజేష్ (20) రెండు నెలల క్రితం ఆయన మృతి చెందడంతో ఇటీవల తణుకులోని తల్లిదండ్రుల వద్దకు వచ్చేశాడు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకు చదువుకుని ఇంట్లోనే ఉంటున్న తేజేష్ తాతయ్య చనిపోయిన నాటి నుంచి మానసిక సంఘర్షణకు లోనయ్యాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి శేషాపు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ వెల్లడించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

చింతలపూడి: చికిత్స పొందుతూ చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు ఆదివారం తెలిపాయి. శనివారం స్థానిక ఆసుపత్రిలో చేరిన సమయంలో తనపేరు భద్రమ్మ వయస్సు 40 సంవత్సరాలు అని చెప్పినట్లు తెలిపారు. మృతురాలిని గుర్తు పట్టిన వారు చింతలపూడి ఎస్సై ఫోన్ 9440796675 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పురుగు మందు తాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు మండలానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మండలం జాలిపూడికి చెందిన కాండ్రు సీతయ్య(50) ఆటో డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య కొద్దిరోజుల క్రితం భర్త సీతయ్యతో గొడవ పడి పుట్టింటికి వెళ్లింది. సీతయ్య ఒక్కడే ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆదివారం పెదవేగిలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. మార్గమధ్యలో పురుగుమందు తాగి ఆ విషయాన్ని కుమార్తె, అల్లుడితో చెప్పాడు. వారు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. సీతయ్య అప్పుల పాలై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పాలనలో క్రీ(డ)ల్

- అటకెక్కిన వైఎస్సార్ క్రీడా పురస్కారాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.కోటి మంజూరు
- నాడు స్వాగతించిన క్రీడా సంఘాలు
- కూటమి ప్రభుత్వంలో నీరుగారిన స్పోర్ట్స్ పాలసీ




వైఎస్సార్ పురస్కారం అందుకున్న టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి తిరుమలరావు (ఫైల్), ఏలూరులో నిర్వహించిన కబడ్డీ పోటీలు (ఫైల్)

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో క్రీడలకు ప్రోత్సాహం కరువైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించిన క్రీడా పాలసీలో గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ క్రీడా పురస్కారాలు రద్దు చేయడంపై క్రీడాకారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ప్రోత్సహించకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక చేయూత లేకుండా పేద, మధ్య తరగతి బాలబాలికలు క్రీడల్లో రాణించడం కష్టమని భావిస్తున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఎస్సార్ పురస్కారాలు పథకం అమలు చేసి క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించిందని గుర్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించేలా ఆర్థిక భరోసా కల్పిస్తూ కొత్త క్రీడా పాలసీ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించిన జగనన్న ప్రభుత్వం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు దివంగత నేత వైఎస్సార్ క్రీడా పురస్కారాలు పేరిట లక్షల రూపాయలు నగదు బహుమతులు అందించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడాకారులకు లక్షల రూపాయల పురస్కారం అందించడంపై నాడు క్రీడా సంఘాలు హర్షం వెలిబుచ్చాయి. వైఎస్ జగన్ ప్రోత్సాహంతో క్రీడల్లో రాష్ట్ర యువతీ యువకులు అద్భుత ప్రతిభా పాటవాలు కనబరిచారు.

సుమారు రూ.కోటి అందజేత

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పురస్కారాలు పేరిట రూ 97 లక్షల 34 వేల 624 అందించారు. జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారులకు రూ.5 లక్షలు, సిల్వర్ మెడల్ సాధించిన వారికి రూ.3 లక్షలు, బ్రాంజ్‌మెడల్ సొంతం చేసుకున్నవారికి రూ.2.5 లక్షలు చొప్పున అందించారు. ఇలా క్రీడా పురస్కారం అందుకున్న క్రీడాకారుల్లో టెన్నికాయిట్ బాలికలు ప్రథమ స్థానంలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారికి రూ.లక్షా 99 వేలు అందజేయడం విశేషం. వీరిలో అథ్లెట్లు, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎక్కువగా ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడలు ఆరోగ్యాన్ని ఇస్తాయి అంటూ మాటలు చెప్పడం వల్ల ఉపయోగం ఉండదు. నిరంతరం సాధన చేసే బాలబాలికలకు ప్రోత్సాహం అందించాలి. క్రీడా పురస్కారం క్రీడాకారులకు ఎంతో మేలు చేస్తుంది. పురస్కారం అందుకోవాలనే తపన బాలబాలికల్లో పెరిగి మరింత మంది సాధన చేస్తారు. దీని ఫలితంగా రాష్ట్రం క్రీడల్లో సైతం ముందంజ వేస్తుంది. గత ప్రభుత్వం ఇదే కోణంలో ఆలోచించి క్రీడా పురస్కారాల పేరుతో బాలబాలికలకు ఆర్థిక చేయూత ఇచ్చింది. – చంద్రశేఖర్, ఏలూరు

పురస్కారాలు అందించాలి



వైఎస్సార్ క్రీడా పురస్కారాలు పథకం మరిచిపోలేనిది. ఈ పథకం కింద అథ్లెటిక్స్, టెన్నికాయిట్ తదితర క్రీడాకారులకు లక్షలాది రూపాయలు అందించడం వల్ల క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. దీని ఫలితంగా గత ఐదేళ్ల జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించారు. దేశానికి, రాష్ట్రానికి పేరు తెచ్చారు. ఏళ్ల తరబడి సాధన చేసిన బాలబాలికలకు ఆర్థిక పురస్కారాలు అందిస్తే, కష్టించి సాధన చేస్తారు. – కొండలరావు, రిటైర్డ్ శాయ్ సెంటర్ ఇన్‌చార్జి

కడుపునొప్పి తాళలేక..

భీమడోలు: విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని పాత అంబర్‌పేటకు చెందిన కొడుదుల వెంకట్రావు(53) మద్యానికి బానిసై కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి వద్ద విపరీతంగా కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకట్రావును కుటుంబ సభ్యులు భీమడోలు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఏలూరు, అనంతరం విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వెంకట్రావు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

సత్యసాయి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కొయ్యలగూడెం: శ్రీసత్య సాయి తాగునీటి పథకం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు యూనియన్ గౌరవ అధ్యక్షుడు దేగ ప్రభాకర్ ఆదివారం పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శ్రీసత్యసాయి మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ మూడవ మహాసభ నిర్వహించిన సందర్భంగా యూనియన్ కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. అధ్యక్షుడిగా జి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆచంట సత్యనారాయణ, కోశాధికారిగా పిల్లి నాగ వీరబాబు, ఉపాధ్యక్షులుగా బొంత వరప్రసాద్, సీహెచ్ పోసిబాబు, సహాయ కార్యదర్శులుగా టి.రవీంద్ర, ఎం.శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా జి.రమేష్, డీవీ చారి, పి.సురేష్, అల్లు రాజు, వి.రేగులయ్య, బి.సురేష్, దాసరి రవి, పి.ప్రసాద్, యు.రవికుమార్, సీహెచ్ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు.

బాగా చదవాలని చెప్పినందుకు..


సర్కారు కాల్వలో యువకుడి కోసం గాలిస్తున్న రూరల్ ఎస్సై రాంబాబు


ఘటనా స్థలం వద్ద విలపిస్తున్న తండ్రి, బంధువులు

- మనస్థాపానికి గురై కాలువలోకి దూకిన బాలుడు
- చెల్లి పుట్టిన రోజు వేడుకలో విషాదం
- యువకుడి కోసం గాలిస్తున్న పోలీసులు


ఆత్మహత్యకు పాల్పడిన పోలినాయుడు (ఫైల్)

కైకలూరు: పదో తరగతిలోకి వచ్చావు.. బాగా చదివి 500 పైనే మార్కులు తెచ్చుకోవాలని తండ్రి, బంధువులు చెప్పడంతో మనస్థాపానికి గురైన ఓ బాలుడు కొల్లేరు సర్కారు కాల్వ వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా, కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం వద్ద ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. ఏలూరులో కొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన పేడాడ రామకృష్ణరావు సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె. కుమారుడు పోలినాయుడు(16) ఏలూరు లిటిల్ బర్డ్స్ కాన్వెంటులో 10వ తరగతి చదువుతున్నాడు. కుమార్తె పుట్టినరోజు వేడుకను కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద జరుపుకోడానికి ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి వచ్చారు. పదో తరగతిలో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని పలువురు చెప్పడంతో పోలినాయుడు మనోవేదనకు గురయ్యాడు. బంధువు దుర్గ అనే మహిళతో నేను ఏలూరు వెళ్లిపోతున్నానని తల్లిదండ్రులకు చెప్పకుండా పందిరిపల్లిగూడెం సర్కారు కాల్వ వంతెన వద్దకు వచ్చి ఒక్కసారిగా కాలువలోకి దూకేశాడు. అటుగా వెళుతూ ఈ దృశ్యాన్ని చూసిన వ్యక్తి విషయాన్ని పోలీసులకు చెప్పారు. కొల్లేటికోట దేవస్థానం వద్ద పుట్టినరోజు జరుపుకుంటున్న తల్లిదండ్రులకు తెలియడంతో సర్కారు కాల్వ వంతెన వద్దకు వెళ్లారు. కుమారుడు చెప్పులను గుర్తించిన తల్లిదండ్రులు బోరున విలపించారు. పుట్టిన రోజు వేడుకకు వచ్చిన అందరూ హఠాత్తుగా జరిగిన పరిణామంతో కంగుతిన్నారు. తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. రూరల్ ఎస్సై రాంబాబు, కొల్లేరు సంఘ నాయకుడు బలే ఏసురాజు బోటుపై బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

కొత్త పింఛన్లు లేనట్టే..

- అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్



యలమంచిలి మండలం మేడపాడు గ్రామ సచివాలయం

యలమంచిలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఆర్భాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛను ఇవ్వలేదు.. అయితే ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేస్తుండటంతో ఇదెక్కడి విడ్డూరం అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అర్హత ఉన్నా ఎదురుచూపులే

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తుంది. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఇంకా ప్రభుత్వం నుంచి సమాచారం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా తెలియదనే సమాధానం వస్తోంది.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛను, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపేసింది. దీంతో కొత్తగా పింఛన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించినవారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన వెబ్‌సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటినా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

పింఛన్లు తొలగించే కుట్ర

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. అక్టోబర్‌లో గ్రామ సభలు పెట్టి అనర్హత పేరుతో పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటే, ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడం పై తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఆకివీడు: స్థానిక సాయి నగర్‌లో వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన అన్నసంతర్పణలో అపశ్రుతి చోటుచేసుకుంది. అన్నసమారాధన అనంతరం స్టీరియో బాక్సులు వద్ద కూర్చున్న యువకుడు యారాబటి హేమంత్(18) విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతన్ని అక్కడ ఉన్న యువకులు, స్థానికులు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. యువకుడి తండ్రి రామకృష్ణ తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు.

ఇసుక దోపిడీ

- గోదావరి నుంచి పడవలపై తీసుకువచ్చి దర్జాగా అమ్మకాలు
- వాటాలు తెగకపోవడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు


భీమలాపురంలో పడవలపై తీసుకువస్తున్న ఇసుక, ట్రాక్టర్లపై రవాణా (అంతర చిత్రం)

పెనుగొండ: ఆచంట నియోజకవర్గం భీమలాపురంలో ఇసుక దోపిడికి శ్రీకారం చుట్టారు. భీమలాపురంలో ఇసుక ర్యాంపు లేకపోయినా, గోదావరి మధ్యకు వెళ్లి పడవలపై ఇసుక తీసుకువచ్చి మరీ దర్జాగా అమ్మకాలు ప్రారంభించారు. సచివాలయం నిర్మాణం ముసుగులో స్థానిక ప్రజాప్రతినిధి అక్రమ అమ్మకాలకు తెరతీశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో కొసమెరుపు ఏమిటంటే వాటాలు తెగలేదో ఏమిటో స్వయనా కూటమి నాయకుడే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం విశేషం. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి ర్యాంపులు ఉన్నాయి. కరుగోరు మిల్లిలో కొంత కాలం పడవల ర్యాంపు నిర్వహణ చేశారు. అయితే, ప్రస్తుతానికి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అన్ని ర్యాంపులూ వరద నీటితో నిండిపోయి ఉన్నాయి. దీంతో ఇసుక లేక వినియోగదారులు, పనిలేక కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పెండ్యాల, తీపర్రు వంటి స్టాకు యార్డులనుంచి ఇసుక వస్తున్నా, అయిదు యూనిట్ల లారీకి రూ.22 వేలకు పైగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో స్థానికంగా ఇసుక కొరతను దష్టిలో పెట్టుకొని, గ్రామప్రజాప్రతినిధి సచివాలయ నిర్మాణం కోసం అంటూ పడవలపై ఇసుక తీసుకువచ్చి ట్రాక్టర్లపై ఎగుమతులు చేస్తూ చిలక్కొట్టుడుకు శ్రీకారం చుట్టారు. స్థానికంగా ప్రభుత్వ భవనాలకు సైతం ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. సచివాలయ నిర్మాణం వంకతో అమ్మకాలకు శ్రీకారం చుట్టడంతో స్థానిక నాయకుల్లో చిచ్చు రేపింది. యూనిట్ రూ.6 వేలకు అమ్మకాలు ప్రారంభించారు. ట్రాక్టర్లపై ఎగుమతి చేసి అమ్మకాలు చేయడంతో ఇతర నాయకులు తమ వాటా ఎంత అంటూ ప్రశ్నించడంతో ప్రారంభమైన వివాదం జిల్లా అధికారులకు ఫిర్యాదు వరకూ వెళ్లింది. దీంతో తాత్కాలికంగా అక్రమ అమ్మకాలు నిలిపివేశారు.

రైతు సంఘాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

- రైతుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఉద్యమం
- ప్రకటించిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ద్వారకాతిరుమల: రైతు సంఘాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతుల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం చేపడుతున్నట్టు ప్రకటించారు. ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. దీంతో మూడు రోజుల పాటు జరిగిన ఏపీ రైతు సంఘం రాష్ట్రస్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు ముగిశాయి. ముందుగా రాష్ట్రంలోని రైతుల సమస్యలను చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే రైతులు సంఘటితం కావడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలకు పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నష్టాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు, ఉద్యాన, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. అన్ని పంటలకు బీమా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది సంభవించిన కరువు, మిచాంగ్ తుపాను పంట నష్టాలకు పంటల బీమా పరిహారం అందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో జరుగుతున్న దీక్షల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం దశల వారీగా ఉద్యమాలకు సమాయత్తం కావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. ఆయిల్ పామ్, కొబ్బరి, జీడి, చెరకు తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివశంకరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.మోహన్‌రావు, పశ్చిమగోదావరి, విజయనగరం, గుంటూరు జిల్లాల కార్యదర్శులు ఆకుల హరే రామ్, రాంబాబు, కంచుమాటి అజయ్ కుమార్, ఎన్టీఆర్, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల అధ్యక్షులు వెంకటరెడ్డి, జీవీ సుబ్బారావు, కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

యంత్రాల దిగుమతిని అడ్డుకున్న స్థానికులు


ఫ్యాక్టరీ ఏర్పాటుకు వీల్లేదంటూ గ్రామస్తుల ఆందోళన


యంత్రాలను వెనక్కి పంపిన సమతానగర్ వాసులు

ఆకివీడు: స్థానిక సమతానగర్ రోడ్డులోని మూతపడిన రైస్ మిల్లు ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్లాస్టిక్ కనికెలు(దిమ్మలు) తయారు చేసే యంత్రాలను శనివారం రాత్రి దిగుమతి చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి వీల్లేదని ఆందోళన నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కరగబెట్టడం వల్ల రసాయనిక వాయువులు వ్యాప్తి చెంది, కేన్సర్ వంటి భయంకరమైన, ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతం కొల్లేరు అభయారణ్యంలో ఉన్నందున కాంటూర్-5 దిగువ ప్రాంతంలో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయకూడదని వారు అభయారణ్యం ప్రాంతీయ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో అభయారణ్య గార్డులు, సెక్షన్ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి యంత్రాల దిగుమతిని అడ్డుకుని, అక్కడ నుంచి పంపించివేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయకూడదని వారు హెచ్చరించారు. గత నాలుగు నెలలుగా ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు తాము వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టర్, అభయారణ్య జిల్లా అధికారికి, తహసీల్దార్, కాలుష్యనియంత్రణ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశామని సమతానగర్ వాసి బైరి ఆంజనేయులు విలేకర్లకు తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు లేవని, ఆ దిశగా ఏమీ పనులు చేపట్టవద్దని సంబంధిత యజమానిని హెచ్చరించారు. అయితే మూతపడిన రైమిల్లు ప్రాంతాన్ని లీజుకు తీసుకుని గోడౌన్‌గా ఉపయోగించుకుంటామని యజమాని అధికారులకు చెప్పి, ఇప్పుడు యంత్రాలు దిగుమతి చేయడం దారుణమని ఆంజనేయులు, ఆప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఐదవ కాంటూర్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటు, ప్లాస్టిక్ వ్యర్థాల గోడౌన్‌ను తక్షణం నిలుపుదల చేయాలని, గోడౌన్ నడుపుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేద్దామని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఎం భాగ్యలక్ష్మిపేట శాఖ 8వ మహాసభ ఆదివారం పట్టణంలో చిటికిన రాము అధ్యక్షతన నిర్వహించారు. కలిగట్ల వీర్రాజు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను పరిష్కరించాలని, మంచినీటి సరఫరాలో లోపాలను సరిచేయాలని, ఆస్తి పన్ను, నీటి పన్నులపై ఆందోళన చేద్దామన్నారు. అలాగే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని, సూపర్ సిక్స్ పథకాలను హామీ మేరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కొండలరావు, తదితరులు హాజరయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మన్‌కి బాత్‌లో పటేల్ శక్తి కేంద్రం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ 114వ కార్యక్రమం ఆన్‌లైన్‌లో ఆదివారం పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రం సభ్యులు వీక్షించారు. పటేల్ శక్తి కేంద్రం అధ్యక్షులు నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ మన్‌కీ బాత్‌లో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామన్నారు. బీజేపీ పట్టణ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు రైతాంగాన్ని ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడిపూడి కాలువ ముంపు వలన నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురంలో సీపీఎం గ్రామ సభ పీలా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ భూముల సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని, జగన్నాథపురం నుంచి ఆరుగొలను గురుకుల పాఠశాల, కళాశాలకు వెళ్లే రహదారులను నిర్మించాలన్నారు. మండల నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా కండెల్లి విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలా గాదినాయుడు, ఆరేపల్లి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అన్న సమారాధన



అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా తణుకు 9వవార్డులోని గోస్తనీ కాలువ సమీపంలో ఉన్న శ్రీసిద్ధి వినాయకస్వామి ఆలయంవద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. తణుకు పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధికసంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. 40 వేలకుపైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని రుచిక ఎంపిక



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లిలోని తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.రుచిక రాష్ట్ర స్థాయిలో అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యింది. అక్టోబరులో నిర్వహించే పోటీల్లో రుచిక పాల్గొంటుందని ప్రిన్సిపల్ దేవీప్రియ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బాలికను ప్రిన్సిపల్ దేవీప్రియ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూరల్ ఇన్‌చార్జి ఎస్సై ఐ.వీర్రాజు సిబ్బందితో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2 వేల 350 నగదును స్వాధీనం చేసుకున్నారు.

కళాశాల ఇలా.. చదువులు సాగేదెలా ?



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీరు



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతి గదుల ముందు నిలిచిపోయిన వర్షపు నీరు

వర్షపు నీటిలోనే కళాశాల ప్రాంగణం

తణుకు టౌన్: పట్టణంలోని విద్యార్థులకు ఉన్నత విద్య అంటే తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తక్కున గుర్తుకు వస్తుంది. ఈ నేపథ్యంలో తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ కొద్దిపాటి వర్షానికి జలమయం కావడంతో తమ చదువులు సాగేదెలా..? అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కళాశాల భవనాలు, ఆవరణ పల్లం కావడంతో పాటు చుట్టూ ఉన్న డ్రెయినేజీలు మెరకగా మారిపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక కళాశాల ఆవరణలోనే నిలిచిపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఈ నేపథ్యంలో విద్యార్థుల చదువులకు డిగ్రీ కళాశాల ఏ మాత్రం ఉపయోగకరంగా ఉందో? ఓ సారి తెలుసుకుందాం.

1968లో నిర్మాణం

తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సజ్జాపురంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ భూముల్లో 1968 సంవత్సరంలో 30 సంవత్సరాల అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తణుకు ప్రాంత ప్రజలకు ఇంటర్, డిగ్రీ కోర్సులు అందిస్తూ విద్యా సేవలందిస్తుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చుట్టూ ఉన్న డ్రెయినేజీలు ఎత్తుగా ఉండటంతో కొద్ది పాటి వర్షానికే కళాశాల ఆవరణలో మురుగునీరు నిలిచిపోయి తరగతి గదులు ముందు నిలిచిపోతుంది. ఈ మురుగునీరు వారం, పది రోజుల పాటు అలాగే నిలిచిపోవడంతో ఆ మురుగు నీటిని దాటుకుని విద్యార్థులు తరగతి గదులకు హాజరుకావాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దీనితో పాటు కళాశాల ఆవరణలోనే వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో ఈ వాకింగ్ ట్రాక్ కోసం ఆవరణ చుట్టూ మెరక చేయడంతో అక్కడ కూడా వర్షపు నీరు కూడా కళాశాల తరగతి గదుల ముందుకు చేరి మరింత ఇబ్బంది కలుగజేస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే పక్కన ఉన్న జూనియర్ కళాశాల ఆవరణలో కొత్తగా డ్రెయిన్ నిర్మించడంతో అది డిగ్రీ కళాశాల డ్రెయినేజీల కన్నా మెరకగా ఉండటంతో కురిసిన వర్షపు నీరు మొత్తం డిగ్రీ కళాశాలలోనే నిలిచిపోతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ఆవరణలో నిలిచిపోయిన మురుగునీటిలో పందుల సంచారంతో మరింత మురుగునీటిగా మారి దుర్వాసన వెదజల్లుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగునీటితో అసలు సమస్య

కళాశాల ఆవరణలో మురుగునీరు రోజులతరబడి నిలిచిపోవడంతో ఈ మురుగునీటిలోని దోమలు, ఈగలు తమపై వాలి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఆ దోమలు ద్వారా డెంగీ, మలేరియా వంటి రోగాలు ఎక్కడ వస్తాయనే భయంతో తరగతులకు హాజరవుతున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కళాశాల పక్కన ఉన్న డ్రెయినేజీల్లోని మురుగునీరు వర్షం కురిసినప్పుడు డ్రెయినేజీల ద్వారా బ్యాక్ వాటర్ కళాశాలలో చేరి మున్సిపల్ డ్రైనేజీలలో నీరు పూర్తిగా వెళ్లిన తర్వాత కళాశాల ఆవరణలోని మురుగునీరు బయటకు వెళ్లేదని, అయితే ప్రస్తుతం చుట్టు పక్కల డ్రెయినేజీలు ఎత్తుగా మారిపోవడం, పక్కన జూనియర్ కళాశాలలో డ్రెయినేజీలు ఎత్తుగా నిర్మించడంతో డిగ్రీ కళాశాల ఆవరణ మొత్తం చెరువుగా మారిపోయి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చే అసలు సమస్య

కళాశాల యాజమాన్యం ఆయిల్ ఇంజిన్‌ల ద్వారా కళాశాల ఆవరణలో నిలిచిపోయిన మురుగునీటిని బయటకు తోడుతున్నారు. దీంతో ఇలా ఆయిల్ ఇంజిన్లతో నీటిని బయటకు తోడే ప్రతిసారీ రూ.5 వేల నుంచి 10 వేల వరకూ ఖర్చు అవుతుందని యాజమాన్యం పేర్కొంటుంది. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల ఆవరణలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మురుగు పారితే సమస్య ఉండదు



ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రస్తుతం చుట్టు పక్కల కంటే పల్లంగా వుండటంతో వర్షం కురిస్తే ఆ నీరు ఆవరణలో వుండిపోతుంది. ఆ వర్షపు నీరు వారం, పది రోజుల పాటు ఆవరణలో నిలిచిపోవడంతో ఆ నీటిని దాటుకుని తరగతులకు వెళ్తున్నాం. కళాశాల ఆవరణలో నిలిచిపోయిన మురుగునీటిలో పందులు సంచరించడంతో వాటిలో ఈగలు, దోమలు మాపై వాలుతున్నాయి. డెంగీ, మలేరియా వంటి రోగాలు వ్యాపిస్తాయనే భయంగా ఉంది. తక్షణం అధికారులు కళాశాల ఆవరణలో మురుగునీటి సమస్యను పరిష్కంచాలి. – కె.సాయి కృష్ణ, బీకాం విద్యార్థి, ప్రభుత్వ కళాశాల, తణుకు

మున్సిపల్ అధికారులకు చెప్పాం

తణుకులోని ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిలిచిపోతున్న వర్షపు నీటిని బయటకు పంపించేందుకు కళాశాలకు చాలా భారంగా మారింది. చుట్టూ మున్సిపల్ డ్రెయినేజీలు కళాశాల ఆవరణ కంటే ఎత్తులో వుండటంతో సమస్య ఏర్పడుతుంది. కళాశాల ఆవరణలో నిలిచిపోతున్న మురుగునీటిని ఆయిల్ ఇంజిన్‌ల ద్వారా బయటకు పంపిస్తున్నాం. కళాశాలలోని మురుగు నీటి సమస్యను స్థానిక మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – ఆర్‌కే ఫణిధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తణుకు

ఉత్సాహంగా మానవత సభ్యత్వ నమోదు



తణుకు మానవత సంస్థ సమావేశంలో మాట్లాడుతున్న గమిని రాంబాబు

తణుకు టౌన్: తణుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థలో ఇప్పటి వరకూ 1000 మంది సభ్యులు నమోదైనట్లు మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు చెప్పారు. తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి అధ్యక్షతన ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో జరిగిన మానవత సంస్థ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు, సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం మానవత సంస్థ సభ్యత్వ నమోదుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు మాట్లాడుతూ మానవత సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ ఎస్వీ సతీష్ బాబు, తణుకు మానవత కార్యదర్శి బి.రామకాశీ తమ నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో కోశాధికారి అక్కిన కాశీ, అక్కిన లక్ష్మీ, వీవీ రామకృష్ణ, ఆర్ శేషుబాబు, బోడపాటి ప్రసాద్, పి.శివన్నారాయణ, ఎన్‌కే ప్రభు, కొర్లేపర సత్యనారాయణ, వంగూరి హనుమంతరావు, అలపాటి సుబ్బారావు, సోమేశ్వరరావు, కేవీ రమణమూర్తి, డాక్టర్ రామలక్ష్మీ, కఠారి విశ్వనాథరాజు, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

అండర్-19లో విద్యార్థుల ప్రతిభ

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 విభాగంలో సెప్టెంబరు 13 నుంచి 22 వరకూ జరిగిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఎంపిక పోటీల్లో తణుకు ఎస్‌కేఎస్‌డీ జూనియర్ మహిళా కళాశాలకు చెందిన 29 మంది విద్యార్థినులు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు ఆదివారం విలేకరులకు తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులు అండర్ 19 క్రికెట్‌లో ఎం.సిరి, బాల్ బ్యాడ్మింటన్‌లో పీవీ కిరణ్మయి, ఎస్.ఈశ్వరి లలితా కుమారి, ఎం.అమూల్య, కబడ్డీలో కె.వసంత, ఎం.కీర్తి, బాస్కెట్ బాల్‌లో మోహన గాయిత్రీ, బి.సురేఖ, ఎస్.భారతి, ఫుట్ బాల్‌లో ఎల్.దేవమాధురి, హాకీలో పి.కీర్తి, పి.సువర్ణిక, షటిల్‌లో ఎస్.ఈశ్వరి, పి.పరోషిత, నవ్య, అమృత వర్షిణి, మేఘన, యోగాలో టి.సంధ్యారాణి, ఎల్.దేవ మాధురి, కుసుమ కావ్య, పి.కీర్తి సువర్ణిక, సీహెచ్ శశి వెన్నెల, వాలీబాల్‌లో జి.విజయలక్ష్మీ, ఎ.శిరీషా, ఖోఖోలో డీఎస్ శిరి సుధ, సుష్మ భారతి, సీహెచ్ శైలజ, కె.సుభాషిణి, త్రోబాల్‌లో కె.మేరీమణి, బ్లెస్సీ, చదరంగంలో జి.ప్రవల్లిక, ఎంపికైనట్లు తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల విభాగంలో సుష్మ భారతి, సాఫ్ట్ బాల్‌లో ఎ.శిరీషా, బేస్ బాల్‌లో ఎ.శిరీషా, డి.నాగమౌనిక, ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులందరూ. రాష్ట్రర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, పీడీలు ఎం.శ్రీనివాసరావు, ఎం.రత్నకుమారి తదితరులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు



ఫౌండేషన్ ప్రతినిధులను సన్మానిస్తున్న మంతెన బాబు

పాలకోడేరు: మాతృ దేశానికి సేవ చేయాలనే తలంపుతో మారుమూల గ్రామీణ ప్రాంతమైన కోరుకొల్లును దత్తత తీసుకొని ప్రజలకు వైద్య సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నారని మంతెన ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగీంద్ర కుమార్ బాబు అన్నారు. గ్లోబల్ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఫౌండర్ డాక్టర్ భూపతిరాజు పెండేటి బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రితో మంతెన వెంకట ప్రహ్లాదరాజు ట్రస్ట్ చైర్మన్ మంతెన బాబు ఆధ్వర్యంలో ఆదివారం కోరుకొల్లులో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయిన సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల్లో 75 గ్రామాలను దత్తత తీసుకొని సేవలు అందిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఈ సేవలను మరింత విస్తృతం చేస్తారన్నారు. ఇప్పటికే పాలకోడేరు మండలంలోని కోరుకొల్లు, మైప గ్రామాలను దత్తత తీసుకున్నారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వర్మ హాస్పిటల్స్, విష్ణు హాస్పిటల్, స్వామి జ్ఞానానంద, బసవతారకం హాస్పిటల్స్ వారు వైద్య సేవలు అందించారు. కోరుకొల్లు మైప గ్రామాలకు సంబంధించి 500 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేకూరి చంటిరాజు, మాజీ సర్పంచ్ పెదచంటి, చేకూరి సాంబమూర్తి రాజు, గొట్టుముక్కల తిరుపతి రాజు, బైర్రాజు కన్వీనర్ మంతెన రాయపరాజు, క్షత్రియ సంఘం సెక్రటరీ పెన్మత్స సూర్యనారాయణ రాజు, వైద్యులు డాక్టర్ శ్రావణి కుమారి, డాక్టర్ సులోచన రాణి, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రవిశంకర్ ప్రసాద్, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు ఆరోగ్య మిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: పారిశుద్ధ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మహదేవపట్నం గ్రామ సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని మండలంలోని మహదేవపట్నంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కొంత కాలంగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాటిని పూర్తి స్థాయిలో తొలగించారు. లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిని విద్యుత్ మోటార్ ద్వారా తోడేవారమని విద్యుత్ మోటార్ కాలిపోవడంతో గత రెండు రోజుల నుంచి వర్షపు నీరు నిలిచిపోయిందని, ఆదివారం పూర్తి స్థాయిలో నీటిని బయటకు పంపించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు స్థానికులు మాతో కూడా సహకరించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వనిమా శ్రీనివాస్, కార్యదర్శి కె.పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు తణుకులో సంగీత విభావరి

తణుకు టౌన్: ప్రముఖ సినీ గాయకులు ఎస్వీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశార. మంగళవారం సాయంత్రం తణుకు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రముఖ ఆర్కెస్ట్రా గాయకుడు ఎ.రాజు, ఇతర గాయకులు పాల్గొనే ఈ సంగీత విభావరి కార్యక్రమంలో ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత సన్యాసిరావు



సన్యాసిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉండి: జిల్లాలో హైవేలు, ఆర్అండ్‌బీ ఛార్జ్‌డ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సన్యాసిరావు ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. ఈ నెల 27న అనారోగ్య కారణాలతో మృతి చెందిన సన్యాసిరావు చిత్ర పటానికి సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భగా నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘంగా 50 ఏళ్లు కార్మికుల పక్షంగా ఉండి, ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన మృతి కార్మిక లోకానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



జ్వరాల సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందం

ఉండి: యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం ఆదివారం మండలంలోని మహదేవపట్నంలోని ఉత్తరపాలెంలో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కేపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వేలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే జ్వర పీడితులను గుర్తించి, వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎ.పెద్దిరాజు, ఎంఎల్‌హెచ్‌పీ డీవీవీ సుబ్బలక్ష్మి, ఏఎన్ఎం టి.సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

భీమవరం: యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా విశ్వనాథం గురునాగ దుర్గారావు, ఎం.కుమార్‌బాబు ఎన్నికయ్యారు. ఆదివారం భీమవరంలో నిర్వహించిన సంఘం ఎన్నికల్లో వారితోపాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు తెలిపారు. ఉపాధ్యక్షులుగా జి.బాలాజి, ఆర్.సత్యశ్రీ, ఎం. స్వామి, జాయింట్ సెక్రటరీలుగా బి.ప్రవళిక, వి.సురేంద్రరెడ్డి, ట్రెజరీగా కె.మాణిక్యాలరావు ఎన్నికయ్యారన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు



తేతలిలో మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు, సైకాలజిస్ట్ కోట శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం తేతలి గ్రామానికి చెందిన కోట వెంకయ్య, రాఘవమ్మల ఆధ్వర్యంలో గ్రామంలోని గొడ రామాలయం వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో తణుకు పట్టణానికి చెందిన లలిత గ్యాస్ట్రో, లివర్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ కేఎస్ఎస్‌వీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

సంచార వైద్యశాలద్వారా 8మందికి వైద్య సేవలు

తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 8 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, కె.సావరం పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని 8 మంది వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు, కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు కోరారు. స్థానిక అంబేడ్కర్ హాల్ వద్ద ఆదివారం సాయంత్రం మంగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని ముందుకు వస్తే దేశ వ్యాప్తంగా జన గణన, కుల గణన తప్పనిసరన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు 22 శాతం పెంచాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు చిచ్చు పెట్టింది చంద్రబాబు నాయుడేనన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బి.శరత్‌బాబు, ఫ్రాన్సిస్ రాజు, చోడదాసి జైపాల్, కాంతారావు, శ్యామ్ ప్రకాస్, జయరాజు, రవిదేవా, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్‌క్లబ్‌లో గత మూడురోజులుగా సాగుతున్న భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్ 2కే24 కార్యక్రమం ఆదివారం ముగిసింది. సంఘం నియోజకవర్గ కన్వీనర్ పి.వాసు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని చెప్పారు. ఇటీవల కాలంలో యువత చెడువ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ లాంటి విష సంస్కృతుల జోలికి వెళ్లకూడదని సూచించారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రామ్, ఫెస్ట్ కో–కన్వీనర్ ఎండీ జాన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



బాలికలు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి విజయదుర్గ

మొగల్తూరు: భుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థినులకు ఆహారం అందించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ ఆదేశించారు. ఆదివారం మొగల్తూరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని విజయదుర్గ, బాలుర వసతి గృహాన్ని అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్‌లు సందర్శించారు. అనంతరం సీతారామపురంలోని మిషన్ ఆఫ్ హోప్ చిల్డ్రన్ హోమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వసతి గృహంలోని వంట గదులు, బాత్‌రూమ్‌లు, పడక గదులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వసతి గృహంలోని విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాత్ రూమ్‌లు, వంట గదులు, అపరిశుభ్రంగా ఉండడం, పడక గదులు ఇరుగ్గా ఉండడం, మురుగు నీరు పారే సౌకర్యం సరిగ్గా లేకపోవడాన్ని గుర్తించారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని వార్డెన్‌లకు సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జి.వాసు, లీగల్ సర్వీసస్ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, కె.కరుణ్ కుమార్, వార్డెన్లు కె.ధారవేని, సాగర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

పెనుమంట్ర: పర్యావరణ పరిరక్షణకు ఏ సహాయాన్నైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని శర్వాన్ ఫిజియోథెరపీ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి అలేఖ్య అన్నారు ఆదివారం మార్టేరులో జరిగిన పెనుమంట్ర మండల మానవతా సంస్థ సర్వసభ్య సమావేశం ముఖ్య అతిథిగా పాల్గొన్న అలేఖ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాకు లేని భాగ్యం, గోదావరి జిల్లాలకు ఉందని, ఈ జిల్లాల వాసులు చేసుకున్న అదృష్టమని తెలిపారు. అయితే నేడు నదీ జలాలు పంట కాలువలు కలుషితం కావడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఒక్కరిపై ఉందన్నారు కర్రి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక పేద విద్యార్థికి మానవత తరపున రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని డాక్టర్ రెడ్డి అందజేశారు.